క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే సబితారెడ్డి రాక

కందుకూరు: కందుకూరు మండలంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయడానికి ఎమ్మెల్యే సబితారెడ్డి శుక్రవారం రానున్నట్లు తహసీల్దార్ గోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశంలో ఉదయం 10.30 గంటలకు చెక్కుల పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

జీరో బిల్లు పథకం అమలు చేస్తాం

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: జీరో బిల్లు పథకం లబ్ధిదారులకు తప్పకుండా అమలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన క్యాంపును అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ప్రజాపాలన సందర్భంగా ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తులు తీసుకున్నామని, జీరో బిల్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని పరిశీలించి అర్హులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయనున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఇప్పటి వరకు 70 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత, కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ, ఆదిత్యనగర్ కాలనీలో హెచ్ఎండీఏ నిధులతో వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం మేయర్ చిగురింత పారిజాత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్లు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, డీఈఈ యాదయ్య, ఏఈఈ వినీల్‌గౌడ్, జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఐలమ్మ, కాలనీ అధ్యక్షుడు పుట్టగళ్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బోర్ నీటిలో డ్రైనేజీ వాటర్

ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు



డ్రైనేజీ మూతలను పరిశీలిస్తున్న అధికారులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ వినాయకహిల్స్ ఫేస్–2లోని రోడ్ నంబర్ 5లో బోరు నీటిలోకి డ్రైనేజీ వాటర్ కలుస్తుందని కాలనీ వాసులు కార్పొరేటర్‌కు బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గురువారం అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

కాంగ్రెస్ నాయకుడు చింతకింది నవీన్



చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న కాంగ్రెస్ నాయకుడు నవీన్ గౌడ్

పహాడీషరీఫ్: పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని కాంగ్రెస్ నాయకుడు చింతకింది నవీన్ పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీలో రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి వేశారు. బక్రీద్ పురస్కరించుకొని శానిటేషన్ సిబ్బంది ఎక్కువ శాతం షాహిన్‌నగర్ పరిసరాలకే పరిమితం కావడంతో, శ్రీరాం కాలనీ వైపు చెత్త పేరుకుపోయి స్థానికంగా దుర్గంధం వెదజల్లుతుందన్నారు. ఈ విషయం తెలుసుకున్న నవీన్ గౌడ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కమిషనర్ జేసీబీ, ట్రాక్టర్, కార్మికులను కేటాయించడంతో ప్రత్యేక డ్రైవ్‌తో వ్యర్థాలను తొలగింపజేశారు.

నేడు యోగా డే వేడుకలు

మన్సూరాబాద్: స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. రిటైర్డ్ సైంటిస్ట్, యోగా గురువు భరత్‌భూషణ్ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని కార్పొరేటర్ తెలిపారు.

నాణ్యమైన బోధనే లక్ష్యం

- ప్రిన్సిపాల్, ఉమాదేవి
- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల
- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు
- ప్రస్తుత సంవత్సరానికి 250 మంది చేరిక



కొత్తగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల



కళాశాలలో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి ప్లాంటు

కందుకూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ప్రైవేట్‌కు దీటుగా మారింది. దీంతో మండలంలోని విద్యార్థులు ఇక్కడ అడ్మిషన్ తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. 2009–10 సంవత్సరంలో కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో నాలుగు గదుల్లో జూనియర్ కళాశాల 40 మంది విద్యార్థులతో ప్రారంభించారు. రెండు గ్రూపులతో తెలుగు మీడియంలో మొదలైంది. కేవలం ప్రిన్సిపాల్ మినహా ఇతర అధ్యాపకులు అంతా తాత్కాలిక పద్ధతిలోనే నియమితులయ్యారు. దినదినాభివృద్ధి చెందుతూ ఫలితాల్లో మండలంలోనే ముందు వరుసలో దూసుకపోతుంది. ప్రస్తుతం 2023–24కు వచ్చే సరికి 250 మందికి పైగా విద్యార్థులతో సరిపడా బోధన, బోధనేతర సిబ్బందితో కళాశాల నడుస్తుంది. ప్రస్తుతం కందుకూరు రెవెన్యూ, కొత్తగూడ గ్రామ పరిధిలో 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన భవనంలోనే 2017–18 నుంచి తరగతులు కొనసాగుతున్నాయి.

జిల్లా స్థాయిలోనే...

జూనియర్ కళాశాలలోని విద్యార్థులు 80 శాతంకంటే ఎక్కువే ప్రతిభ చూపి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఇక్కడ మెరుగైన ఫలితాలు నమోదు చేస్తున్నారు. 2019–20, 2020–21 సంవత్సరాల్లో వంద శాతం ఫలితాలు సాధించారు. గతేడాది 80 శాతం ఫలితాలు వచ్చాయి. నాణ్యమైన విద్యా బోధనతో పాటు తగిన ఆట స్థలం, శుద్ధి చేసిన తాగునీటి సరఫరా చేస్తున్నారు. విద్యార్థులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, మూత్రశాలల సౌకర్యం ఏర్పాటు చేశారు. అనుభవం కలిగిన అధ్యాపకులు బోధన చేపడుతున్నారు. ప్రతి ఏడాది ఫ్రెషర్స్ డే, వార్షికోత్సవం, టీచర్స్ డే వంటి వాటితో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ముందుంటున్నారు. విద్యార్థులు జిల్లా స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సైతం సాధించారు. దీంతో చాలా మంది విద్యార్థులు ఇక్కడ చేరడానికి ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది ప్రస్తుతం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు అన్ని సౌకర్యాలతో అందుబాటులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని అధ్యాపకులు కోరుతున్నారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం..



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. నాణ్యమైన బోధనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. 14 గదులతో ప్రభుత్వం రెండు భవనాలు నిర్మించింది. స్వచ్ఛమైన తాగునీటితో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది. ముఖ్యంగా అనుభవం కలిగిన అధ్యాపకులు బోధన చేస్తున్నారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఉమాదేవి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల



నూతన కమిటీతో పాటు జిల్లా వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి

కందుకూరు: కందుకూరు లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా సురసాని విఠల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం రాత్రి కందుకూరులో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ జి మహేంద్రకుమార్‌రెడ్డి, నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుని గురువారం ప్రకటించారు. అధ్యక్షుడితో పాటు సెక్రటరీగా తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తాను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైస్ చైర్మన్ మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్లబ్ సభ్యులు ప్రతి నెలా కనీసం ఒక్కసారైన సమావేశమవ్వాలన్నారు. సభ్యులు సభ్యత్వ రుసుమును సకాలంలో చెల్లిస్తే సమాజ సేవకు ఖర్చుచేయొచ్చన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికై న విఠల్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. క్లబ్ తరపున సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడతానని పేర్కొన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా కేబినెట్ మెంబర్ తాళ్ల అంజయ్య, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు బీఆర్ రాంరెడ్డి, ఎస్.వెంకట్‌రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబితారెడ్డిపై విమర్శలు మానుకోవాలి

- బీఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మాజీ మంత్రి, పి సబితా ఇంద్రారెడ్డిపై బీజేపీ నాయకులు చేస్తున్న విమర్శలు మానుకోవాలని తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుక్కుగూడ మున్సిపాలిటీని జీహెచ్ఎంసీలో విలీనం చేయొద్దని బీజేపీ నాయకులు ఈ నెల19న ధర్నా చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా సబితాఇంద్రారెడ్డిపై విమర్శలు చేయ డం బాధాకరమన్నారు. సబితా ఇంద్రారెడ్డి గతంలో మంత్రిగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకురాలని కొనియాడారు. మహిళ ఎమ్మెల్యే అని కనీస గౌరవం ఇవ్వకుండా ఆరోపణ చేయడం సరికాదన్నారు. మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే బీఆర్ఎస్ కూడా పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రవినాయక్, సప్పిడి లావణ్య, సుమన్, శ్యామేల్ రాజు, బాకారం వెంకట్‌రాజిరెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



భారీగా పొంగుతున్న డ్రైనేజీ

మూడ్రోజులైనా పరిష్కారం కాని సమస్య

- పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు
- స్థానికుల ఆందోళన

లింగోజిగూడ: కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్ ప్రధాన రహదారిలో 10 రోజులుగా పొంగి పొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది మూడు రోజులుగా శ్రమిస్తున్నా సమస్య మాత్రం ఇంకా పరిష్కారం కాలేదు. కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్ ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం వందల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీంతో పనులకు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో గురువారం ట్రాఫిక్ పోలీసులతో రెండు వైపులా భారీ గేట్లను ఏర్పాటు చేసి వాహనాలను తపోవన్ కాలనీ మీదుగా మళ్లించారు. దీంతో కొద్దిగా ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఆందోళన..

పది రోజులుగా డ్రైనేజీ పొంగి పొర్లుతున్నా అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకపోవడంపై వడ్డెర బస్తీ, తపోవన్ కాలనీ వాసులు, స్థానిక వ్యాపారులు గురువారం ఆందోళనకు దిగారు. అధికారుల నిర్లక్ష్య ధోరణితో ఇబ్బందులు పడుతున్నామని, చిన్న సమస్యను పరిష్కరించడానికి ఇన్ని రోజులు ఎందుకు తీసుకుంటున్నారని మండిపడుతున్నారు. జలమండలి అధికారులకు కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నాలాల్లో భారీగా చెత్తా చెదారం..

వర్ష కాలం దృష్టిలో పెట్టుకొని నాలాల్లో, డ్రైనేజీ మ్యాన్ హోళ్లలో పూడిక తీత పనులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొంగుతన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ సమస్య పరిష్కారం కాకపోవడంతో రెండు మూడు మీటర్ల మేర డ్రైనేజీ పైప్‌లైన్ తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.అలాగే తపోవన్ కాలనీ ఫేజ్– కమాన్ వద్ద గురువారం పూడిక తీత పనులు చేపట్టగా భారీగా చెత్త వచ్చింది. నాలాలో ఒక చోట సుమారు రెండు ట్రాక్టర్ల మట్టి, దుస్తులు, రాళ్లు భయ పడటంతో స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

తొలగించని సెంట్రింగ్..

వరద ముంపు సమస్యకు శ్రీనివాస్ కాలనీ మీదుగా సరూర్‌నగర్ చెరువులో కలిసే విధంగా ఇటీవల బాక్స్ డ్రైన్‌ను నిర్మించారు.బాక్స్ డ్రైన్ నిర్మాణం అనంతరం పైన స్లాబ్‌లను నిర్మించారు.స్లాబ్ నిర్మాణం కోసం బాక్స్ డ్రైన్‌లో ఏర్పాటు చేసి సెంట్రింగ్‌ను చాలా చోట్ల తొలిగించకుండా అలాగే వదిలేశారు.సెంట్రింగ్ కర్రలకు చెత్తాచెదారం తట్టుకొని డ్రైనేజీ నీరు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

దరఖాస్తుల ఆహ్వానం

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్లో తాత్కాలిక పద్ధతిలో గంటల ప్రాతిపదికన బోధించుటకు ఆసక్తి కలిగినవారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి ధనుంజయ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహేశ్వరం మోడల్ స్కూల్, కాలేజీలో బోధన చేయుటకు ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హత, అనుభవం, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. టీజీటీ హిందీ, పీజీటీ మ్యాథ్స్, పీజీటీ ఫిజిక్స్, పీజీటీ ఇంగ్లీష్, పీజీటీ కామర్స్ సబ్జెక్టుల వారీగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. టీజీటీ పోస్టులకు డిగ్రీ, బీఎడ్ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. పీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టు లో పీజీ, బీఈడీ ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 22న తేదీలోగా కళాశాలలో ఇవ్వవలసిందిగా తెలిపారు. మరిన్ని వివరాలకు 9849746567, 9603150011 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 71, వంకాయ 35, బెండ 55, పచ్చిమిర్చి 85, కాకర 65, బీర 72, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 23, క్యారెట్ 40. దొండ 45, ఆలు 35, ఉల్లి 39, గోకర 55, దోస 27, సొర 17, పొట్ల 23, అరటి 11, చిక్కుడు 70, అర్వి 37, మునగ 80, చిలగడదుంప 50, బీట్‌రూట్ 23, కీర 33, ఫ్రెంచ్ బీన్స్ 175, కాప్సికమ్ 80. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు ఈ ధరలు అమలులో ఉంటాయి.

సీఎం సహాయ నిధితో పేదలకు లబ్ధి



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: హయత్‌నగర్ పరిధి పవనగిరి కాలనీకి చెందిన భరత్‌చంద్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స ఖర్చులు భరించే ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో కుటుంబసభ్యులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.15 లక్షల ఎల్‌ఓసీ చెక్కును మంజూరు చేయించి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం సహాయ నిధి వల్ల ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతోందని, పేదలు నాణ్యమైన వైద్య సేవలు పొందేందుకు అండగా ఉంటున్నదని అన్నారు. నాయకులు రఘుమారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



అధికారులతో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడమే ధ్యేయమని, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సరూర్‌నగర్, ఆర్కేపురానికి చెందిన జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, ఎలక్ట్రికల్ అధికారులతో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు డివిజన్లలోని కాలనీలు, బస్తీల్లో జరుగుతున్న పనుల గురించి ఆరా తీశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ప్రజలకు అనుగుణంగా మెరుగు పరచాలని సూచించారు. తను ప్రతీ కాలనీలో, బస్తీల్లో పర్యటిస్తానన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకుంటున్న తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ డీసీ, ఈఈ, ఏఈలు విద్యుత్ శాఖకు చెందిన ఏడీ, ఏఈలు వాటరవర్క్స్ అధికారులు, ఏఈ, టౌనప్లానింగ్, శానిటేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యలను పరిష్కరించండి

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో నెలకొన్న బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు, రోడ్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. గురువారం ఆయన జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌ను కలిశారు. కొత్తపేట డివిజన్‌లో ఉన్న బాక్స్ డ్రెయిన్, రోడ్డు తదితర సమస్యలను వివరించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఏఈ మత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు. న్యూనాగోలు కాలనీలో గురువారం కార్పొరేటర్ పవన్‌కుమార్ పర్యటించి కాలనీ సమస్యలను తెలుసుకున్నాడు. వెంటనే జలమండలి అధికారులతో మాట్లాడి కాలనీలో ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి వేయిద్దాం

- మేయర్ ఎం దుర్గా



మీర్‌పేట: జిల్లెలగూడ పాఠశాలలో ఆల్బెండజోల్ మందు వేస్తున్న మేయర్ దుర్గా

మీర్‌పేట: నులిపురుగుల నివారణకు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం దుర్గాదీప్‌లాల్ చౌహాన్ సూచించారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మేయర్ అల్బెండజోల్ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం రాకుండా కాపాడుతాయన్నారు. శారీరకంగా, మానసికంగా పిల్లలు దృడంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గజ్జెల రాంచందర్, ఆర్‌ఓ అంజన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయులు సరళ, పీహెచ్‌సీ డాక్టర్ వైశాలి తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో

బడంగ్‌పేట్: గుర్రంగూడలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మందును మేయర్ పారిజాత, కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకోవచ్చన్నారు. వైద్యాధికారి నర్సింగ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరులో

కందుకూరు: కొత్తగూడ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మండల వైద్యాధికారిణి డాక్టర్ రాధిక విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ జి శమంత ప్రభాకర్‌రెడ్డి మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రవీందర్, ఏఎన్ఎం అర్చన, ప్రిన్సిపాల్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: గుర్రంగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ



కందుకూరు: కస్తూర్బాగాంధీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాధిక